రహదారులపైనే పార్కింగ్



సూర్యతేజానగర్ డబుల్ రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు



శ్రీకాంత్‌నగర్ డబుల్ రోడ్డులో పార్కింగ్ చేసిన వాహనాలు

- పార్కింగ్ స్థలాలుగా ఉపయోగించు కుంటున్న ప్రైవేటు వాహనదారులు
- జీవీఎంసీ నిధుల వృథా

ఆరిలోవ: జీవీఎంసీ కొన్ని రూ.కోట్లు ప్రజా ధనం ఖర్చుచేసి రోడ్ల విస్తరణ చేపట్టింది. ఇరుగ్గా ఉన్న రోడ్లు వెడల్పు చేసింది. ఆ రోడ్లుకిరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించింది. వాహదారులకు ఇబ్బందులు లేకుండా..ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అధికారులు రహదారులు విస్తరించారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్ల విస్తరణను ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు, లారీ యజమానులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. విశాలంగా ఉన్న రహదారుల్లో తమ ట్రావెల్స్ బస్సులను పార్కింగ్‌గా ఉపయోగించుకుంటున్నారు. రహదారి విస్తరించినా ప్రజలకు ఉపయోగం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరిలోవ ప్రాంతం శ్రీకాంత్‌నగర్ గెడ్డ పక్కన సుమారు ఒకటిన్నర కిలోమీటర్లు డబుల్ రోడ్డు నిర్మించారు. దానిలో ఒక లైన్‌లో సగం రోడ్డు ఆక్రమించినట్లు ట్రావెల్స్ బస్‌లు, బోర్‌వెల్ తీసే లారీలు, వ్యానులు నిత్యం నిలిపేస్తున్నారు. దీంతో ఈ రోడ్డు ఇరుకుగా మారి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనికి సమీపంలో చినగదిలి బీఆర్‌టీఎస్ కూడలి వద్ద నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం నుంచి సూర్యతేజానగర్ ఉన్న 20 అడుగుల వెడల్పు ఉండే రోడ్డును 60 నుంచి 80 అడుగులకు ఇటీవల విస్తరించారు. దీని కోసం జీవీఎంసీ అధికారులు రూ.2.35 కోట్లు ఎంపీ నిధులు ఖర్చు చేశారు. డబుల్ రోడ్డు నిర్మించి దానికి ఇరుపక్కలా పాత్ వేలు నిర్మించారు. మధ్యలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. దీంతో వాహనాలు నడపడానికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, రోడ్డు ప్రమాదాలు జరగవని వాహనచోదకులు భావించారు. కొత్తగా నిర్మించిన ఈ రోడ్డు కూడా ప్రైవేట్ వాహనాలకు పార్కింగ్‌గా మారిపోయింది. దీంతో రోడ్డు విస్తరించినా ఫలితం కనిపించడంలేదని స్థానికులు అంటున్నారు. నిజానికి వాహన రాకపోకలు సులువుగా జరగడానికి, రోడ్డు ప్రమాదాలు నివారణకు రోడ్ల విస్తరణ చేపడుతుంటారు. అదే ఉద్దేశంతో అధికారులు ఇక్కడ రూ.కోట్లు నిధులు ఖర్చు చేసి రోడ్లు విస్తరించినప్పటికీ కొందరు ప్రైవేట్ వాహనాల యజమానులు ఆ రోడ్లను పార్కింగ్ స్థలాలుగా వినియోగించుకొంటున్నారు. అధికారులు మాత్రం వాటిని పట్టించుకోవడంలేదని స్థానికులు, ఆ రోడ్లపై వెళుతున్న వాహనచోదకులు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్ల మీద వాహనాలు పార్కింగ్ చేయకుండా శాశ్వతమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సీతకొండ వ్యూ అదిరింది



సీతకొండ వద్ద బీచ్‌రోడ్డులో వెలుగుతున్న విద్యుత్ దీపాలు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి జోడుగుళ్లపాలెం నుంచి సీతకొండ వరకు బీచ్‌రోడ్డు సుందరంగా మారింది. సీతకొండ మలుపు వద్ద గతంలో సింగిల్ లైన్‌తో ఉండే రోడ్డు గత ఏడాది నగరంలో జరిగిన జీ–20 సదస్సుతో మోక్షం కలిగింది. జీవీఎంసీ అధికారులు ఈ రోడ్డును అభివృద్ధి చేశారు. డబుల్ రోడ్డు నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ సీవ్యూ పాయింట్ ఏర్పాటు చేసి సందర్శకులు సౌలభ్యం కోసం రోడ్డుకు ఇరుపక్కలా పాత్‌లు నిర్మించారు. మలుపులతో ఉన్న ఈ రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ సందర్శకులను కనువిందు చేస్తోంది. ఇక్కడ విద్యుత్ దీపాల వెలుగులు రాత్రి సమయంలో సందర్శకులకు కన్నులు మిరమిట్లుగొల్పుతున్నాయి.

క్లుప్తంగా

రిటైల్ మేనేజ్‌మెంట్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు, అకడమిక్‌డీన్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, ఏయూ పరిశోధక విద్యార్థి టి.యశ్వంత్ కుమార్‌లు సంయుక్తంగా రచించిన ఫండమెంటల్స్ ఆఫ్ రిటైల్ మేనేజ్‌మెంట్ పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలను అభినందించారు. మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపయుక్తంగా పుస్తక రచన చేయడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యదృక్పథాలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: పోటీ పరీక్షలకు ఉపయుక్తంగా నిలచే విద్య దృక్పథాలు పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. డీఎస్సీ, టెట్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ పుస్తకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమి ఈ పుస్తకాన్ని ప్రచురించింది. ఈ పుస్తకానికి ఏయూ విద్య విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు చీఫ్ ఎడిటర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంప్రదాయ ఔషధం ఆయుర్వేదం

బీచ్‌రోడ్డు: ఆయుర్వేదం అనేది శరీరం, మనస్సు, ఆత్మ సమతుల్యతను కాపాడుకునే లక్ష్యంతో భారతదేశంలో పుట్టిన సంప్రదాయ ఔషధమని ఆయుర్వేద వైద్యుడు గౌతమన్ కృష్ణమూర్తి అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం ఆయుర్వేదంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదంలోని వివిధ చికిత్సల్లో వర్మ థెరపీ ప్రత్యేకంగా నిలుస్తుందన్నారు. వేల సంవత్సరాలుగా ఈ థెరపీ ద్వారా దక్షిణ భారతదేశంలోని పలు ప్రాంతాల్లో వివిధ వ్యాధులు నయం చేస్తున్నారన్నారు. ఇది ముఖ్యంగా తమిళ సిద్ధవైద్యంలో అంతర్భాగమన్నారు. నేటి అత్యాధునిక వైద్య విధానాలకు అనుగుణంగా ఆయుర్వేదంలో కూడా పలు మార్పు చేసి రోగులకు చికిత్సను అందించడం అభినందనీయమన్నారు. ఆహార అలవాట్లు, చికిత్స సమయంలో ఆరోగ్యకరమైన ఆహారాన్ని అనుసరించడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు.

రక్త క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యంతోనే మరణాలు



సదస్సులో పాల్గొన్న వైద్యులు

బీచ్‌రోడ్డు: రక్త క్యాన్సర్ సాధారణమైనదే..అయితే నిర్ధారణ ఆలస్యమైతేనే ప్రమాదకరమని టీఎంసీ డైరెక్టర్ డాక్టర్ సుదీప్ గుప్తా అన్నారు. హోమి బాబా క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో రక్త క్యాన్సర్‌పై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త క్యాన్సర్‌లో ల్యుకేమియా, లింఫోమాస్ వంటి వ్యాధులను ముందస్తుగా గుర్తించడం వలన అరికట్టవచ్చునన్నారు. రక్త క్యాన్సర్‌పై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. క్యాన్సర్ రోగులకు ప్లేట్‌లెట్ డోనర్ అవశ్యకతను వివరించి నమ్మకమైన నెట్‌వర్క్‌ను నిర్మించడం ద్వారా క్యాన్సర్‌ను నియంత్రించేందుకు దోహపడుతుందన్నారు. ఈ సదస్సులో హోమి బాబా ఆస్పత్రి డైరెక్టర్ మహం శెట్టి, హోమి బాబా వైద్యులు పాల్గొన్నారు.

పెదగదిలిలో దంచికొట్టిన వర్షం



పెదగదిలి వద్ద నిలిచిపోయిన వర్షపు నీట్లో వాహనాలు



మద్దిలపాలెం సిగ్నల్ కూడలి వద్ద జోరువాన



భారీ వర్షంతో చెరువును తలపించిన పిఠాపురంకాలనీ సర్వీసు రోడ్డు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి శనివారం వర్షపు నీటితో నిండిపోయింది. సాయంత్రం కురిసిన వర్షానికి పెదగదిలి కొండవాలు నుంచి ఇక్కడకు చేరిన వరద నీరు నిలిచిపోయింది. వాహనచోధకులు ఇబ్బంది పడ్డారు. కార్లు,టైర్లు వర్షపు నీటిలో మునిగిపోయాయి. ఆటోలు లోపలకు నీరు చేరిపోయింది. దిచక్రవాహనాలు సైలెన్సర్లు వరకు మునిగిపోయాయి. చిన్నపాటి వర్షానికి సైతం ఇక్కడ నీరు నిల్వ ఉండిపోతోంది. వర్షం కురిసినప్పుడు ఇక్కడ నిత్యం ఇదే పరిస్థితి. పెదగదిలి కొండవాలు ప్రాంతం నుంచి ఇక్కడకు చేరిన నీరు వెంటనే కిందకు ప్రవహించడానికి వీలుగా సరైన డ్రైనేజీ సిస్టం లేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా ఇక్కడ గంటలు తరబడి నీరు నిలిచిపోతుంది. వర్షం కురిసిన ప్రతిసారి నీట్లో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రెండు, మూడు నెలలు పాటు తరుచూ ఇదే పరిస్థితి ఎదుర్కోవాలని వాహనచోదకులు అంటున్నారు.

ఊరట చెందిన జనం

మద్దిలపాలెం: రెండుమూడు రోజులుగా ఊరిస్తున్న వర్షం ఎట్టకేలకు శనివారం దంచికొట్టింది. సుమారు 45 నిమిషాలు పాటు కురిసిన వర్షంతో కాలనీలు, రహదారులు తడిసిముద్దయ్యాయి. భారీగా కురిసిన వర్షానికి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. వర్షం తీవ్రతకు రోడ్డు సైతం కనిపించకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. పలు కాలనీల్లో కాలువలు పొంగిపొర్లాయి. మద్దిపాలెం, కేఆర్ఎంకాలనీ, శివాజీపాలెం రోడ్డు, పిఠాపురంకాలనీ సర్వీసు రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి.

విద్యార్థినికి ఆర్థిక సాయం



జోడుగుళ్లపాలెంలో విద్యార్థి భార్గవి తల్లిదండ్రులకు నగదు అందజేస్తున్న ఏయూటీడీ సంస్థ కార్యదర్శి వాసు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి జోడుగుళ్లపాలానికి చెందిన డి.భార్గవి పదో తరగతిలో ఉత్తీర్ణురాలైంది. ఇంటర్‌లో చేరాలని అనుకొనే సమయంలో అనారోగ్యానికి గురైంది. ఆమె శరీరంలో మల్టీ ఆర్గాన్స్ పాడయ్యాయి. దీంతో పేద కుటుంబానికి చెందిన ఆమెకు తల్లిదండ్రులు వైద్యం చేయించలేని పరిస్థితిలో ఉన్నారు. ఈ విషయం తెలుసుకొన్న విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ రూ.30 వేలు, మిత్ర మండలి సభ్యులు మరో 29 వేల రూపాయలను ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు శనివారం జోడుగుళ్లపాలెంలో భార్గవి తల్లిదండ్రులకు అందజేశారు. దీంతో ఈఏఎస్ శర్మకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. భార్గవి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

ఉత్సాహంగా అంగన్‌వాడీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్న ఉన్నతాధికారులు, చిన్నారులు

ఎంవీపీకాలనీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే వేడుక శనివారం ఉత్సాహంగా జరిగింది. 19వ వార్డు జాలరిపేటలోని 8 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో ఎంవీఆర్ కుమారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యభ్యాసం పూర్తిచేసుకున్న విద్యార్థులంతా ప్రైమరీ విద్యలో ప్రవేశం పొందుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో చదువుపై వారిలో ఆసక్తి పెంచేందుకు ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ విష్ణుమూర్తి, జీవీఎంసీ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, ఏసీడీపీఓ శ్రీలత, రవి సిద్ధార్థలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



సంతపాలెం పాఠశాలలో పాట్ పెయింటింగ్ వేస్తున్న విద్యార్థులు



తోటగరువు హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జూ ఉద్యోగి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కు అధికారులు ఎకో క్లబ్ ఫర్ మిషన్ లైఫ్ పేరుతో నగరంలో పాఠశాలల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆరిలోవ ప్రాంతం సంతపాలెం, తోటగరవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మధురవాడలో చంద్రపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అవగాహన కల్పించారు. నీటిని ఆదా చేయడం, శక్తిని ఆదా చేయడం, ఇ–వ్యర్థాలను తగ్గించడం తదితర అంశాలు గురించి ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వివరించారు. ఇందులో భాగంగా సంతపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కుండలపై పర్యావరణం గురించి బొమ్మలు వేయడం(పాట్ పెయింటింగ్) పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జూలో ఏర్పాటు చేసిన ఎకో క్లబ్‌లలో సభ్యులకు చేరడానికి ఆసక్తిగల విద్యార్థులు 7893632900 నంబరకు సంప్రదించాలని జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ల్యాబ్ టెక్నీషియన్లకు గాయాలు

బీచ్‌రోడ్డు: ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. శుక్రవారం అర్ధరాత్రి ఈ సంఘటన చోటు చేసుకుంది. విధులు ముగించుకుని బైకుపై రామ్‌టాకీస్ నుంచి రామ్‌నగర్ వెళ్తున్న ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లు పవన్‌కుమార్, శ్రీనివాసరావులను కారు ఢీకొట్టింది. దీంతో వీరిద్దరూ తీవ్రంగా పడ్డారు. స్థానికులు కొందరు దగ్గరలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి వీరిని తరలించారు. వీరిలో పవన్ కుమార్ అపస్మారకస్థితిలో ఉండగా, శ్రీనివాసరావుకు కాళ్లు విరిగిపోయాయి. మూడో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పారిశ్రామిక అభివృద్ధి, నైపుణ్యంపై వర్కుషాపు



వర్కుషాప్ ప్రారంభిస్తున్న గీతా శ్రీకాంత్ తదితరులు

ఎంవీపీకాలనీ: రోటరీ క్లబ్ విశాఖ, ఎంఎస్ఎంఈ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏపీ చాంబర్స్ ఉమెన్ వింగ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పేరిట వర్కుషాపు నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని గాయత్రి విద్యాపరిషత్‌లో శనివారం ఉదయం ఈ కార్యక్రమం జరిగింది. కొత్త వ్యాపారాలకు అందుబాటులో ఉన్న పథకాలు, రాయితీలపై ఔత్సాహిక వ్యాపార వేత్తలకు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతి అవగాహన కల్పించారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ప్యాకేజింగ్, లైవ్‌స్టాక్ సెక్టార్‌లలో కొత్త పారిశ్రామికవేత్తలకు అవసరమైన హ్యాండ్ హోల్డింగ్ అందించడానికి ఈ వర్కుషాపు నిర్వహించినట్లు ఏపీ చాంబర్స్ ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ గీతా శ్రీకాంత్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌డీసీ ప్రతినిధి డాక్టర్ బి.సాహు, పశువర్థకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.మధుసూధనరావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు సీఏడీఎం రావు తదితరులు పాల్గొన్నారు.

పడవపోయి.. ఎడ్లబండి వచ్చే..



డెయిరీఫారం కూడలిలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండి

ఆరిలోవ: జాతీయరహదారిపై పదో వార్డు పరిధి పాత డెయిరీఫారం కూడలిని జీవీఎంసీ ఇటీవల ఆధునికీకరించింది. ఫౌంటెన్ దాని మధ్యలో గోడ, చుట్టూ ఇనుప గ్రిల్స్ నిర్మించారు. ఫౌంటెన్ మధ్యలో నిర్మించిన గోడపై చూపురులను ఆకట్టుకునేలా ఓ పడవను ఏర్పాటు చేశారు. దీంతో ఈ కూడలికి మరింత అందం వచ్చింది. ఇటీవల పడవను వేరో చోటుకు తరలించారు. పడవకు బదులుగా ఎడ్లబండిని శనివారం ఏర్పాటు చేశారు. దీంతో మరింత ఆకర్షణీయంగా కూడలి మారింది.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం : మద్దిలపాలెం కూడలిలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ముఖద్వారం సమీపంలో పుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన శ్రీ గురు విశ్వస్ఫూర్తి ట్రస్ట్ చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. రెండు నెలలుగా చలివేంద్రం ఏర్పాటు చేసిన సేవలందిస్తున్నారు. రెండు రోజులుగా ఎండలు తీవ్రత అధికంగా ఉండడంతో మజ్జిగ పంపిణీ చేస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

చదువుతోనే ఉన్నత భవిష్యత్తు



స్కాలర్‌షిప్పులు పొందిన విద్యార్థులతో ఎంపీ శ్రీభరత్ తదితరులు

ఎంవీపీకాలనీ: చదువుతోనే యువతకు ఉన్నత భవిష్యత్ సాధ్యమవుతుందని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఎతిహాద్ ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ (ఈఎంసీ) ఆధ్వర్యంలో అర్హతగల ముస్లిం విద్యార్థులకు వార్షిక స్కాలర్‌షిప్ పంపిణీ చేశారు. ఎంవీపీ కాలనీ వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలురుతో సమానంగా ఆడపిల్లలను చదవిస్తున్న తల్లిదండ్రులను ఆయన అభినందించారు. పిల్లలను ఉన్నతంగా నిలిపేందుకు వారు ఎంచుకున్న రంగాల్లో తల్లిదండ్రులు పోత్సహించాలని సూచించారు. చదువుతోనే వారి భవిష్యత్ ఉన్నతంగా నిలుస్తుందన్నారు. పేద ముస్లిం విద్యార్థులను ప్రోత్సాహిస్తూ చదువు దిశగా నడిపిస్తున్న ఈఎంసీ సంస్థ సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఈఎంసీ కార్యదర్శి జాఫర్ హుస్సెన్, కోశాధికారి రియాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన వయోలిన్ కచేరీ



వాయిలీన్ కచేరి చేస్తున్న శ్రీవిద్య బృందం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం వయోలిన్ కచేరీ నిర్వహించారు. బెంగళూరుకు చెందిన శ్రీవిద్య బృందం వయోలిన్ కచేరిని శ్రావ్యంగా నిర్వహించింది. అనంతరం గాత్ర కచేరిని నామతీర్థాల సోదరీమణులు లక్ష్మీ–ప్రసన్నల ద్వయం అద్భుతంగా గీతాలను ఆలపించి మైమరపించారు. ఈ కార్యక్రమంలో ప్రాయోజకుల సద్యోజాతం ట్రస్టీ వి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేవల్ డాక్‌యార్డ్‌లో ముగిసిన విద్యార్థుల ఇంటర్న్‌షిప్



ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సిటీల విద్యార్థులతో నేవీ ఉన్నతాధికారులు



నౌకల విడిభాగాల పనితీరును విద్యార్థులకు వివరిస్తున్న నేవీ సిబ్బంది

సింధియా: విశాఖ నేవల్ డాక్‌యార్డ్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం, గీతం యూనివర్సిటీ విద్యార్థులకు మే 15 నుంచి ఈ నెల 14 వరకు నిర్వహించిన ఇంటర్న్‌షిప్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. నైపుణ్యాభివృద్ధిపై దృష్టి సారిస్తూ మెరైన్ ప్రొపల్షన్, పవర్ జనరేషన్, ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, యాక్సిలరీ డెక్ మెషినరీ ఆన్‌బోర్డ్ వార్‌షిప్‌లకు సంబంధించిన నిర్వహణ వంటి కార్యకలాపాలపై నాలుగు వారాల పాటు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శనివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కమాండర్ సంజయ్‌కుమార్ (హెచ్ఆర్) మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు వివరించారు. మేక్ ఇన్ ఇండియా నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ జరిగిన ఇంటర్న్‌షిప్ కార్యక్రమం భవిష్యత్తులో నిపుణులను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా జరిగిందని, విద్యార్థుల ఆచరణాత్మక జ్ఞానం, పరిశ్రమల అవసరాలను తగ్గించేందుకు అవసరముంటుందని భావిస్తున్నట్లు నేవీ వర్గాలు తెలిపాయి.

కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

1220వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

అగనంపూడి: ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. 1220వ రోజు దీక్ష శిబిరంలో పోరాట కమిటీ నాయకుడు ఆదినారాయణ మాట్లాడుతూ ఉద్య మం కొనసాగుతున్నా, పాలకుల్లో స్పందన లేకపోవడం బాధాకరమన్నారు.